# అభినవ త్రిశంకుడు

సాధారణంగా సభలను నిర్వహించే వాళ్ళకన్నా, వినివెళ్ళే వాళ్ళలోనే ఎక్కువమంది తెలివి గలవాళ్ళు కనిపిస్తారు. స్వరాజ్యమైదాన్‌లో బహిరంగ సభ జరుగుతున్నది. ఒక నాయకమ్మన్యుడు మూడుగంటలసేపు ఊకదంచి, అందరి ప్రాణాల్ని తోడాడు. పత్రిక విలేకరిగా రావటంవల్ల నడిమధ్యలో లేచి రావటానికి వీలులేక అల్లాగే విన్నాను. సభ అయినతరువాత వెళ్ళిపోతున్న జనంలో ఒకాయన బిగ్గరిగా, "ఏమిటోయ్ సోద ? మధ్యమార్గం మధ్యమార్గం అని గోల పెడతాడే కాని అది త్రిశంకు స్వర్గం అవుతుందని గమనిస్తేనా ?" అని వ్యాఖ్యానించాడు.

నేను చటుక్కున ఆయనవైపుకి తిరిగి "త్రిశంకుమార్గం అని అనగానే సరా ? రెండువిధాలయిన చెడుగుని తప్పించుకోవాలి కాని" అని అందుకున్నాను.

"స్వామీ ! మీరేదో చెపుతున్నారు కాని త్రిశంకు స్వర్గం సుఖంగా ఉంటుందనుకున్నారా ?" అన్నాడాయన నన్ను నిలవేసి.

## అంగారకుడు

"ఉండదని మీవాదమా ?" అని రెట్టించాను.

"ఉండదు. ముమ్మాటికీ ఉండదు. మీకు ఓపిక ఉంటే నావాదాన్ని వినాలని కోరుకుంటున్నాను. పత్రికలవాళ్ళు—అందులోను విశ్వరూపం విలేకరి - తప్పకుండా తెలుసుకోవాల్సిన అంశం ఇది." అన్నాడాయన.

మళ్ళీ మైదానంలోకి ప్రవేశించాము.

* * *

"అసలు తమరెవరు స్వామీ ?" అని ప్రశ్నించాను.

"అభినవత్రిశంకుణ్ణి." అన్నాడాయన.

"దీని భావమేమి తిరుమలేశ ?" అన్నాను నవ్వుతూ.

"ప్రభువుల ఉద్దేశంలో గుమస్తాలుగానూ, కమ్యూనిస్టులదృష్టిలో పెట్టె బూర్జువాలుగానూ, షావుకార్లదృష్టిలో బురదపూయించుకునే కన్సూమర్లుగానూ, నేలవిడిచి సాముచేసే రాజకీయ నాయకుల దృష్టిలో అతిప్రధానవర్గంగానూ, మితవాదుల దృష్టిలో ప్రధానమయిన అండగానూ కనిపిస్తూ ఉండే మనుషుల మందలో నేనొకణ్ణి."

"అంటే చాలా గొప్పవాళ్ళన్నమాట."

"ఎందుకని ?"

"యశోద దృష్టిలో గారాబాల కూచయ్యగానూ, కంసుడి దృష్టిలో మృత్యుదేవతగానూ, భక్తులదృష్టిలో భగవంతుడుగానూ, పూజార్లదృష్టిలో అల్లాటప్పయ్యగానూ కనిపించే శ్రీకృష్ణుడితో సమానులన్నమాట."

ఆయన పొట్టచెక్కలయేటట్లు నవ్వి, "బలే వ్యాఖ్యానంచేశారండీ" అన్నాడు.

"అది సరేకాని, ఇందాక 'మధ్యమార్గం' అని చెప్పినందుకు ఆయన పిలక లంకించుకున్నారెందుకు ?"

"లేకపోతే, మధ్యమార్గానికి విడాకులిద్దామని అంతా అనుకుంటున్న రోజుల్లో ఈయన శోభయేమిటండీ ?"

"విడాకు లిద్దామని అనుకుంటున్నది ఎవరు ?"

"మాబోటివాళ్ళం అందరమూ ! మాకు వొచ్చే భత్యాలకూ, పెట్టుకునే ఆపేక్షలకూ తూగకపోతే యేం చేస్తాం ?"

"రెండింటినీ సమన్వయించుకోటంలోనే ఉన్నది ప్రజ్ఞ."

"ఆ కబుర్లన్నీ అవతలపెట్టండి. ఇంతకీ మీరు చెప్పేది అట్లా సమన్వయించుకున్నట్లు నటించమనేగా ? పత్రికలవాళ్ళు ప్రజ్ఞ, ప్రభావం అంటూ ఏవో రాస్తారు. ఇంటిదగ్గిరికి వెడితే, ఆడవాళ్ళు 'ఎందుకొచ్చిన అధమస్తపు బతుకులు ? మింగ మెతుకు లేదు మీసాలకు సంపెంగనూనె' అంటారు."

"మీరు చెప్పేదానికీ, దీనికీ సంబంధం ఏమయినా ఉన్నదా ?"

"సంబంధం కాదు అసలు ఉన్న సంగతి అదే మధ్య తరగతివాళ్ళ బతుకు మింగ మెతుకు లేదన్నట్టే ఉంటుంది."

"కొంచం వివరిస్తారా ?"

"మా త్రిశంకు జాతివాళ్ళ ఆదాయాలు మటుకు కార్మికుల జీతాలకు చేరువలోనే ఉంటయ్. అయితే జీవితాన్ని నడుపుకునే తీరుమటుకు పైతరగతుల్ని అనుకరిస్తుంది. నల్లవాళ్ళ జీతాలతో తెల్లదొరల స్టయిల్ వెళ్ళే ఆంగ్లో ఇండియన్ల మోస్తరుగా ఉంటారు. కాళ్ళు బురదలోనూ, కళ్ళు మబ్బుల్లోనూ ఉంటయ్"

"మరి ఉన్నతాశయాలు అక్కర్లేదంటారా ?"

---

"ఈవిషయములో బ్రాహ్మణుని తప్పు లేదు. తప్పంతా బంట్రోతుదే. ఎందుకంటే గులాబిపువ్వులను యెవ్వరూ కోయకుండా చూడటానికై బంట్రోతు నియమింపబడ్డాడు. ఈ బ్రాహ్మణుడు పువ్వు కోయువరకు అశ్రద్ధగా వూరకుండుట బంట్రోతుదే తప్పు. తెలియక కోసిన బ్రాహ్మణునిది తప్పు కాదు. కావున చెంబు తిరిగి బ్రాహ్మణున కిప్పించి కొట్టినందుకై ఆయునకి బంట్రోతుచే నాలుగు రూపాయి లిప్పించవలెను. మొదటిసారి తప్పుకనుక బంట్రోతును క్షమించవలెను" ఇట్లు చెప్పిన రాజుగారి తీర్పునకు మంత్రి ఆశ్చర్యపడి వెంటనే చెంబును నాలుగు రూపాయలును బంట్రోతు చేత బ్రాహ్మణున కిప్పించి పంపివేశాడు.

"కావాల్సిందే, అయితే వీలునిపట్టి చూసుకోవాలంటాను."

"అంటే మీ అభిప్రాయం ఏమిటి?"

"వీలుదొరికితే షావుకార్ల చంకకి ఎగబాకవొద్దని చెప్పను. కాని వాళ్లు నిర్లక్ష్యంగా ఉంటే పట్టుకుని పాకులాడద్దని చెపుతాను."

"పాకులాడక ఏం చేయ్యమంటారు?"

"కింది తరగతితో చేతులు కలుపుతామని బెదిరించాలి"

"అంతేకాని కలవకూడదంటారు?"

"అవును మరి పైకి పోవాలన్న ఉద్దేశం పెట్టుకున్నప్పుడు కిందివాళ్ళతో కలిస్తే ఎట్లా? కింది తరగతివాళ్ళతో మన అవసరం ఎంతవరకన్నా అంటే, పైతరగతి వాళ్లని బెదిరించి పైకిపోయేవరకే"

"పై తరగతివాళ్లు అంత తెలివి తక్కువ వాళ్లా? మీ కల్ల బొల్లి బెదిరింపుల్ని వాళ్లు కనిపెట్టలేరూ?"

"కొంతవరకు కనిపెట్టగలరు కాని పూర్తిగా తోసిపారేయలేరు."

"ఒక్క ఉదాహరణనయినా చూపించగలరా?"

"భేషుగ్గా! అమెరికన్ డాలర్ స్వాముల్ని చూపించండి అంతకన్నా పైతరతిలో ఎవ్వరూ లేరుకదా! కాని అంత పెద్దవాళ్లనీ బ్రిటిష్ సోషలిష్టులు రపీముని బోల్తాకొట్టించారు."

"ఏం చేశారేమిటి?"

"అ ఏమున్నదీ? అసలైనా వాళ్లెవరో కట్టుపట్టాం, రష్యాతో చేతులు కలుపుతాం అంటూ చెపుతున్నారు. దానికి బెదిరిపోయి అమెరికన్లు డబ్బుని కురిపిస్తున్నారు."

"అయితే బ్రిటన్‌కి అసలు పోట్లాడాల నే ఉందంటారా ఏమిటి?"

"మలయావాళ్లనీ, ఈ జిప్టువాళ్లనీ అడగండి దానికిసమాధానం చెపుతారు."

"మరయితే ఈ బెదిరింపులు దేనికి?"

"అదే మా త్రిశంకుల గొప్పదనం. స్వదేశంలో అధికారంలో నిలవాలంటే, ఏహో సంస్కరణలంటూ చేయాలి. కమ్యూనిస్టుల మోస్తరు దేశంలో పరిస్థితులను ఉల్టాసీదా చేయటం మాకు ఇష్టంలేదు. కాని సంస్కరణలుమాత్రం చేయకతప్పదు. వాటికి కావాల్సిన డబ్బు ఎక్కడినించి వొచ్చినాకు మా అభ్యంతరం లేదు"

"అందుకని?"

"అందుకని మా బ్రిటిష్ సోదరులు మలయానించీ, అమెరికానించీ డబ్బు తెచ్చి, ఏహో కుంభకోణం జరిపి అధికారంలో ఉంటున్నారు. దేశపరిస్థితుల్ని ఉల్టాసీదా చేయరు కనుక కన్సర్వేటివ్‌లు ఆక్షేపణ చెప్ప రు. అయితే బయిటినుంచి డబ్బురాక పోతే ఇక్కడమన సోషలిజం హుళక్కే."

"అంతే నంటారా?"

"కాకపోతే? మనదేశంలో గుమస్తాలు బతకటానికి జీతంపబ్బులతో పాటుగా పొలాలమీది డబ్బుఅవసరమైనట్లుగా ఉంటుంది వాళ్లవ్యవహారం. బ్రిటిష్ సోషలిస్టులకీ, కన్సర్వేటివ్‌లకే విదేశాంగ విధానంలో తేడాలేక పోవటానికి ఇదేకారణం"

"మనదేశానికి అన్వయించే ఉదాహరణ చూపిస్తారా?"

"తప్పకుండా! మన శాసనసభల్ని తీసుకోండి. అధికారం సంపాదించాలనుకునే సభ్యులు చేసేదేమిటి? అయినదానికీ, కానిదానికీ ప్రభుత్వపక్షాన్ని ఏకిపారేస్తారు. ప్రభుత్వంలోఉన్న వాళ్లకంటే తాము పెద్ద ప్రజాసేవకుల మన్నట్లుగా అడుగడుక్కీ విమర్శలూ, సవరణలూ, తీర్మానాలూ కురిపిస్తారు. ఈ ఊదర పడలేక, మొరిగే కుక్కకు బెల్లపు గడ్డవేసినట్లు ఏదో పదవిని ప్రభుత్వం పడేస్తేచాలు. మళ్లీ కిమిన్నాస్తి."

"మనదేశంలో మధ్యతరగతి బ్రిటిష్‌వాళ్లు వొచ్చిన తరవాత నేగదూ ఏర్పడ్డది?"

"పాపాలన్నిటికీ భైరవులు బ్రిటిష్ వాడేనా? ఇప్పటికి షుమారు 800 ఏళ్ల కిందట విజ్ఞానేశ్వరుడు అనే పెద్దమనిషి ఈ జాతికి విత్తనం వేశాడు."

"ఎవరాయన? మితాక్షర గ్రంథకర్త కాదు గదా?"

"ఆయనేస్వామీ! ఆ అమితాక్షర గ్రంథకర్తే"

"అదేమిటండోయ్! అమితాక్షర చేశారు?"

"మరేమనమంటారు? ఆయన మితాక్షర న్యాయమంటూ పెట్టి ఆస్తి పంపకానికి శంకుస్థాపన చేశాడు. దాంతో, ఒక్కొక్క తరమూ గడుస్తున్నకొద్దీ, ఆస్తి పంపిణీకి సంబంధించిన రాతకోతలు అమితంగా పెరిగిపోయినయ్‌కదా! ఇంత తతంగానికి కారణమయిన గ్రంథాన్ని ఏమనమంటారు?" అన్నాడాయన చిరునవ్వుతో.

"అట్లా ఆయన ఎందుకు చేశారంటారు?"

"విజ్ఞానేశ్వరుడు విక్రమాంకదేవుడనే చక్రవర్తి ఆస్థానంలో ఉద్యోగి. సామంతరాజుల, దండనాయకుల బలం తగ్గించే ఉపాయం చెప్పమన్నాడు. వాళ్ల ఆస్తులని విభజించటమేనని చెప్పి, విజ్ఞానేశ్వరుడు ఆ పుస్తకం రాసి పడేశాడు."

"అందులో తప్పేమున్నది?"

"అందులో ఏమీ లేదు. తరవాత వచ్చిన అజ్ఞానేశ్వరులు దానిని సన్నకారు జనాభాకి అన్వయించటంలో వచ్చింది తంటా."

"అది నిజమే. మరి బ్రిటిష్ హయాంలో ఈ తెగ ఎందుకు విజృంభించింది?"

"చేతిపనులమీద ఆధారపడే జీవితపద్ధతి పోయి, యంత్రాలపోటీ వచ్చింది. దాంతో సాంఘిక పరిస్థితి అంతా తలకిందులయి పోయి, అంతా సర్కారు ఉద్యోగాలకు ఎగబడ్డారు."

"మధ్యతరగతివాళ్ల జీవిత విశేషాలు ఏమిటి?"

"వొచ్చే జీతం చాలదు. ఎక్కువ అడగటానికి ఐకమత్యం లేదు. ఎప్పుడూ డబ్బుకి కిటకిటలాడుతూ ఉంటారు."

"మరి వాళ్ల ఆర్థికసమస్య ఎట్లా పరిష్కారం అవుతుంది?"

"అప్పుడప్పుడు లాటరీలోనో, పజిల్సులోనో బహుమానాలు రావాలి."

"అంతా సర్కార్ కొలువులకి ఎగబడితే, చాలినన్ని ఉద్యోగాలు ఉండవుగా?"

సర్కారుకి గుమాస్తాలు కావాలి. గుమాస్తాలను తయారు చేయటానికి ఫ్యాక్టరీలు- అంటే ఆర్ట్సు కాలేజీలు- కావాలి. వీటి నిండా కావలసినంతపని. అదీకాక అసలు వాళ్లు ఒక ట్రిక్కు చేస్తారు."

"ఏమిటండోయ్ అది?"

"ఒకళ్లు ముందు చేర్తారనుకోండి. నెమ్మది నెమ్మదిగా, నాగజెముడు కంప పెరిగినట్లుగా, ఏవేవో డిపార్టుమెంట్లనూ, ఉద్యోగాలను సృష్టించి, తమకుతోడుమరి కొంతమందిని చేర్చుకుంటారు. అంతా కలిసి, గంటలో ముగించేపనిని నెలరోజులు లాగి గారడీ చేస్తారు."

"ఆహా!"

"అంతేకాదు. దీనిలోదానినీ, దానిలో దీనినీ ఇరికించి వ్యవహారాన్ని తెగలనివ్వరు. వ్యవహారంతొందరగా తెగితే తమలో కొంతమంది బయిటికి నడవాలిగా"

"అంతా ఏదో పద్మవ్యూహం మోస్తరు ఉన్నదే?"

"అవును. దాన్నే మీరు రెడ్‌టేప్ అంటారు. ఇంత చేసినా అందరికీ ఉద్యోగాలు దొరకవు. అందుకనికమిటీల టెక్నిక్ మొదలు పెట్టారు"

"ఇదేదో కొత్తటెక్నిక్కే?"

"ఏదో ఒకవిషయంతీసుకునేది, హడావుడి చేసేది, దానిని పరిశీలించటానికి కమిటీ వేయుమనేది. ఆ కమిటీకి నాలుగు సబ్‌కమిటీలూ, పధ్నాలుగు స్పెషల్ సబ్‌కమిటీలూ ఏర్పడతాయ్. విచారణలు, ఉపరి

విచారణలు, నివేదికలు, సవరణలు— ఈ విధంగా గ్రంథం పెరిగిపోతూ ఉంటుంది కాని వ్యవహారం మటుకు తెగలదు. నిజానికి ఈ కాలాన్ని కమటీల యుగం అనొచ్చు."

"నేలవిడిచి సాముచేసే రాజకీయ నాయకులన్నారేమిటి ఇందాక?"

"మాతరగతిని ప్రధాన తరగతి అంటారేమిటి మరి? ఎవరెన్ని చెప్పినా, మేము మధ్యలో ఊగులాడే వాళ్లమే. నిజానికి మమ్మల్ని డబ్బులేని షావుకార్లనాలి. జమీలులేని జమీందార్లనాలి. మా సానుభూతి, మా ఆలోచన్లు ఎప్పుడూ అలాగే ఉంటయ్. అట్లాంటిది మేము ప్రత్యేక వర్గం ఎందు కవుతాం? పెద్ద తరగతిని లోగట్టుకోటం చాతకాక, కింది తరగతి విశ్వాసాన్ని సంపాదించలేక తిరిగే వాళ్లు మమ్మల్ని పట్టుకుని దేవుల్లాడతారు."

"అయితే ఇందాకటి ఉపన్యాసకుడితో మీ తగాదా ఏమిటి?"

"మధ్యమార్గం అన్నది లేదు. ఏ విషయానికి ఆ విషయాన్ని—పండిత నెహ్రూ చెప్పినట్లు—ప్రత్యేకించగానే నిర్ణయంచాలి. ఉపన్యాసకుడు అసలు విషయాన్ని మరచిపోయినాడు."

"సరే; మతవర్గాలకు అండ అన్నారేమిటి?"

"కూలినాలిజనం తిండికి తిప్పలు పడాలి కనుక దేవుణ్ణి గురించి ఆలోచించే తీరికే లేదు - డబ్బుగలవాళ్లకు ఇష్టదైవం లక్ష్మీదేవే. కాబట్టి మామూలు మతం ఏదయినా తగాదా ఉండదు. ఇంకపోతే మిగిలేది త్రిశంకులు. వీళ్లకు ప్రస్తుత సామర్థ్యం లేకపోవటంవల్ల 'కోటయ మనవాడోయ్, వెంకటసుబ్బయ మనవాడోయ్' అంటూ తిరుగుతారు. వెంకటసుబ్బయకూ, అబ్దుల్ రహీంకీ పడదుగదా!"

"దీని పరిణామం ఏమిటి?"

"పరిస్థితులు విషమిస్తే మధ్యతరగతివాళ్లు నాజీలుగా తయారవుతారు. ఇది పై తరగతులకీ, మధ్య తరగతికీ కూడా ప్రమాదకరం. కాబట్టి సంఘసంస్కారం, భరత నాట్యాలు, క్రికెట్ స్టేడియంలు పెట్టిమిగిలినవాళ్ల దృష్టిని మళ్లిస్తారు."

"అయితే మధ్యతరగతివాళ్లు ఏంచేయాలని సలహా ఇస్తారు?"

"మీ ఇంట్లో కాలేజీలో చదువుకునే కుర్రాళ్లున్నారా?"

"ఉన్నారు."

"అయితే వాళ్లల్లో కొంతమందిని లేబర్ నాయకులుగా— నేను ఇందాక చెప్పినట్లుగా— తయారుచేయండి. కొంతమందిని ఏదో ఒకపార్టీలో ఇరికించి రాజకీయాల్లోకి పంపించండి. ఇంకా ఎవరయినా మిగిలితే, షావుకార్ల సెక్రటరీలుగా పంపండి. ఇంక రాజ్యంమీద కాకపోతే అడగండి.... అడుగో పార్కు కాపలా వాడు గేటు వేయటానికి వస్తున్నాడు. అంటూ లేచాడు త్రిశంకుడు."

—

## నేటిప్రపంచం:

# ఆసియా దేశాల శాంతిసాధనకృషి

### చీనాసేనలు

చీనా కమ్యూనిస్టుల 'స్వచ్ఛంద' సైనిక దళాలు ఉత్తర కొరియాలో సంపూర్ణ విజయాన్ని సాధించాయి. ముందువెనుకలు, రణరంగ ప్రాంత నైసర్గికస్థితి, సైనిక వ్యూహాలు, ప్రజాభిప్రాయం మొదలైన వేవీ చూసుకోకుండా, కేవలం విమానబలాలు, బాంబులు శకరకాల ఫిరంగులు అక్షయమైన మారణయంత్రసామగ్రిపైనే ఆధారపడి ఉత్తర కొరియాలో యుద్ధానికి దూకి విజృంభించినందుకుగాను అమెరికన్ సైన్యాలకూ తదితర సమితిసైన్యాలకూ ఘోరపరాజయం సంభవించింది. చీనాసేనలు ఉత్తరకొరియాలో దిగి ఒక్క యుద్ధంలో నిలిచి పోరాడామో లేదో, ముందూ వెనుకా చూసుకోకుండా సమితి సేనలు దక్షిణ కొరియాకు పారిపోయాయి. ఈశాన్యదిశలో హాంహుంగ్ వద్ద చక్రబంధంలో చిక్కుపడిన సేనలు నాశనంకాగా మిగిలినవి ఓడ లెక్కుతున్నాయి. పయంగ్ యాంగ్ నగరాన్ని నేలమట్టంచేసి పరుగు తీసిన అమెరికన్ సేనలు శత్రువు ఎంతదూరంలో ఉన్నాడో, వెన్నాడుతున్నాడో లేదో కూడా చూసుకోకుండా 38 వ అక్షాంశరేఖను దాటి వెళ్లి సోల్ నగరం చేరాయి. అంటే చాంగ్ చున్ నది వద్ద యుద్ధం తరవాత, పయంగ్ యాంగ్ నగరంవద్ద స్వల్పసంఘర్షణ మినహా మరెక్కడా నిలిచి శత్రువుతో పోరాడాలనైనా అమెరికన్ సేనలకు తోచలేదు. చక్రబంధవ్యూహం పన్నడానికి చీనా సేనలు గుర్రాలపైన ఎంత వేగంగా వచ్చాయో, అంతకు మించిన వేగంతో సమితిసేనలు పలాయనం చేశాయన్నమాట. సోల్ నగరానికి వచ్చినతరవాత వెనక్కు తిరిగి చూసేసరికి చీనాసేనలు చూపు మేరలో కూడా కనిపించలేదు. తరవాత వారంరోజులకి గాని ఉత్తరకొరియన్ సేనలు చూపు మేరలోకి రాలేదు.

### రాయబారం

ఇప్పుడు కొరియాయుద్ధంలో నే గాక సమితి రాజకీయాల్లో కూడా విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. చీనా సైన్యాల జోక్యాన్ని నిరసిస్తూ వెంటనే సేనల్ని ఉపసంహరించుకోవలసిందిగా పెకింగ్ ప్రభుత్వానికి ఆదేశమివ్వాలని అమెరికాతో సహా ఆరుదేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమితి ప్రస్తుతానికి బుట్టదాఖలు చెయ్యాడం జరిగింది. చీనాజోలికి పోమని వాగ్దానం ఇవ్వాలని కూడా ఈ తీర్మానంలో ఉంది. ఇది బుట్టదాఖలు కావడానికి బ్రిటిష్ ప్రధాని అట్లీ జరిపిన రాయబారం ఒక హేతువని చెప్పనచ్చును.

1941 లో చర్చిల్ రూజ్వెల్టువద్దకు రాయబారం వెళ్లి అట్లాంటిక్ చార్టర్ సాధించాడు. అమెరికా తన సమరబలాన్నంతా పసిఫిక్ ప్రాంతానికి ధారపొయ్యకూడదనీ యూరప్ సంరక్షణకు ప్రధానంగా వినియోగించాలనీ కోరాడు. అప్పుడు మొదటి అంశాన్ని సాధించలేకపోయినా రెండో అంశాన్ని సాధించగలిగాడు చర్చిల్. ఇప్పుడూ అదే జరిగింది. అమెరికా తన బలాన్నంతా పసిఫిక్ ప్రాంతానికి ధారపొయ్యదు. యూరప్ సంరక్షణనే ప్రధానంగా పరిగణిస్తుంది. అయితే చీనా చేసిన పరాభవానికి నోరు మూసుకుని కూచోడానికి ట్రూమన్ అంగీకరించలేదు. గాడిపొయ్యిదగ్గర కూచుని (ఫైర్ సైడ్) రేడియోద్వారా అమెరికన్ జాతికి ప్రమాదం ఆసన్నమయిందని ట్రూమన్ ప్రకటించాడు. 35 లక్షుల అదనపు సైన్యాన్ని నిర్మించడానికి నిశ్చయించినట్లు ప్రకటించాడు.